# స్వధర్మం

రాంబాబుకు, కోటి రూపాయల లాటరీ తగిలినట్టు తోచింది. మరామత్తు చేసి చేసి విసుగెత్తి పనిచేయదని వదిలేసిన యంత్రం హఠాత్తుగా పనిచేయడం ప్రారంభించిందని విన్న ఆనందం కలిగింది. నలుగురు సీనియర్లని వెనక్కు నెట్టేసి, జూనియర్ అయిన తనకు ప్రమోషన్ ఇచ్చారన్న వార్త విన్నంత సంతోషం అనిపించింది. జి.యం.గారు రమ్మంటున్నారన్న మాట మోసుకొని వచ్చిన బంట్రోతుని వాటేసుకోవాలని తోచింది.

"ఇంకా కదలరేమిటి?" బంట్రోతు అడిగాడు. "జి.యం.గారు మీ గురించే ఎదురు చూస్తూ వుంటారు. మీరు ఏ ఫోనులోను దొరకలేదని చికాకుగా ఉన్నారు. చాలాసేపు ట్రై చేసారట. మీ గురించి. చివరకు విసుగు పుట్టి ఎక్కడవున్నా తోలుకు రమ్మని పంపారు, తెలుసా? కదలండి, మరి" – బంట్రోతు తొందర చేశాడు.

"చూస్తున్నావా... పని చేస్తున్నానా?"- పంపు మరామత్తు చేసే వాళ్ళకు సూచనలిస్తూ, అన్నాడు రాంబాబు.

"వస్తున్నానని చెప్పు"

"అలాగే! ఆలస్యమైతే నాకేమిటి నష్టం"- బంట్రోతు మాటల్లో వెటకారం ధ్వనించింది.

"టైం చూసుకోండి మరి. మూడు గంటలైతే పారిపోయేది మీరే కదా"- బంట్రోతు వెటకారపు మాటలకి అతనిని కొరికి మింగేయాలన్నంత కోపం వచ్చింది రాంబాబుకి. ఐదు గంటల వరకు కర్మాగారంలో పనిచేయవలసినప్పటికీ, తరచూ మూడు గంటలకే వెళ్ళిపోయే తనని ఎత్తి పొడుస్తున్నాడని అర్థమైంది. కాని కందకి లేని దురద కత్తిపీటకు ఎందుకు అన్నట్టు, బాస్‌కు లేని బాధ బంట్రోతుకు ఎందుకని మనసులో అనుకొని పళ్ళు బిగించాడు.

ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు కర్మాగారంలో పని చేయాలి. కాని బాస్ అనుమతితో నెలకు సగం రోజులు మాడు గంటలకే ఇంటికి వెళ్తూ వుంటాడు రాంబాబు. నగరంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో కీలకమైన పాత్ర అతనిది. నగరంలో జరిగే ఏ యాగానికైనా, ప్రవచనానికైనా కావలసిన ఏర్పాట్లు చేసి మోక్ష మార్గంలో పయనిస్తున్నట్టు తరించి పోతుంటాడు రాంబాబు. ఉద్యోగాని కన్నా ఆధ్యాత్మిక కార్యక్రమాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే రాంబాబుకి పని వేళలో కొంత సడలింపు కలిగించి, కొందరు ఉన్నతాధికారులు ధార్మిక ప్రచారానికి తమ వంతు కృషి చేస్తున్నామని సంతృప్తి పొందేవారు. కర్మాగారంలో రాంబాబు చేయవలసిన పని ఎవరైనా చేయవచ్చుకాని నగరంలో రాంబాబు నిర్వహించే కార్యక్రమాలు వేరెవ్వరూ చేయలేరనే అభిప్రాయం వారిది.

చేతులు, మోము కడుక్కున్నాడు రాంబాబు. చేతిసంచి నుంచి విబూది తీసి నుదుటి మీద పులుముకున్నాడు. రూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు అంటించుకొని మరోసారి అద్దంలో చూసుకొని సంతృప్తిగా నవ్వాడు. అవును మరి! కొత్త జి.యం. గారిని మొదటిసారిగా కలవబోతున్నాడు. మొదటి చూపులోనే తను పరమ స్వాతికుడని జి.యం. గారికి తెలియవొద్దూ!

అలమార నుంచి పర్సనల్ ఫైలు తీసి కాగితాలు అటూ ఇటూ తిప్పి చూసాడు. ఉన్నాయి! అన్ని కాగితాలు వరసలోనే వున్నాయి! శ్రీశ్రీశ్రీ ముకుళానంద స్వామీజీ వారు, రాంబాబుని సన్మానించి ఆశీస్సులు అందించే ఫొటోయే ముందుంది. జనాలను మోక్షోన్ముఖులను చేయటం కోసం నిర్వహించే కార్యక్రమాలలో రాంబాబు చేసే సేవల గురించి పత్రికా విలేకరి వ్రాసిన వార్త కూడా ఆ ఫొటో కిందనే వుంది. వివిధ సంస్థలు ప్రదానం చేసిన "ఆధ్యాత్మిక రత్న", "అద్వైత తత్వ పరిరక్షణా పిపాసి" మొదలగు కార్యక్రమాలలో పురప్రముఖులతో, మంత్రులతో తీసుకున్న ఫోటోలు!

తన పర్సనల్ ఫైలు చూసి జి.యం. గారు చిత్తయి పోతారనే నమ్మకం రాంబాబుకు ఉంది. హుషారుగా జి.యం. గారి ఆఫీసు వద్దకు నడిచాడు. రోడ్డుకు ఇరువైపులా ఎదిగిన గులాబి మొక్కలలో విరిసిన పూలలో తన మోము కనబడింది రాంబాబుకి.

గత ఆరు నెలలుగా ఎదురు చూసిన అవకాశం ఇప్పుడు వచ్చింది అతనికి. కొత్త జి.యం. చేరినప్పటి నుంచి అతన్ని కలవటానికి ప్రయత్నిస్తున్నాడు రాంబాబు. నగరంలో తను నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి జి.యం. గారికి తెలియ పరచాలనేది అతని తపన. జి.యం. మద్దతు లేకపోతే పనివేళలు ఎగ్గొట్టి కార్యక్రమాలు నిర్వహించటం కుదరదు కదా!

కాని రాంబాబు లాంటి మామూలు ఇంజినీర్లకు, జి.యం. గారిని కలవటం

అంత సులవైన పని కాదు. జి.యం. అతని బాస్ కాదు. బాస్‌కి బాస్. బాస్ అనుమతి లేనిదే జి.యం.ని కలవలేదు. అంత క్రితం జి.యం. ఇంటివద్ద దొరికే వాడు. అందువల్ల ఇంటికెళ్లి తన సొదంతా వినిపించి మెప్పు, మద్దతు పొందగలిగాడు. కాని కొత్త జి.యం. ఇంటి వద్ద కర్మాగారానికి సంబంధించిన ఎవరిని కలవరట! కర్మాగారంలో కూడా పనికి సంబంధించిన విషయాలే తప్ప మరే విషయాల గురించి మాటలాడనివ్వరట! పని రాక్షసుడు!

"పంపు పని ఎంతవరకు వచ్చింది?" – కేబిన్‌లోకి అడుగుపెట్టగానే అడిగారు జి.యం.

"అవుతోంది సార్..."

"అవుతోందంటే..."– చూసే ఫైలు నుంచి దృష్టి తీయలేదు అతను. రాంబాబుని మర్యాద కోసం కూర్చోమనైనా చెప్పలేదు.

"ఎప్పుడు అవుతుంది? నాకు కావలసినది అది" జి.యం. అన్నారు.

"ఎప్పుడంటే... చాలా ప్రాబ్లెం ఉంది సార్"

"ప్రాబ్లెం అంటే..." జి.యం. తల పైకెత్తి రాంబాబుని చూసారు. అతని నుదుటి మీద కనబడిన కుంకుమ బొట్టు రాంబాబుకి కొంత ధైర్యాన్ని ఇచ్చింది. తన ఫైలు తెరవబోయాడు రాంబాబు.

"సీ మిస్టర్ రాంబాబు. మీ వల్ల కాకపోతే సెలవులో వున్న మీ బాస్‌ని సంప్ర దించండి" కళ్ళద్దాలు తీసి కళ్ళు వొత్తుకున్నాడు జి.యం. ఆ తరువాత అన్నారు "అవసర మైతే మీ బాస్‌ని పిలవండి"

జి.యం. కుర్చీలో వెనకకు వాలారు. మళ్ళీ కళ్ళద్దాలు పెట్టుకొని మరో ఫైలు తెరుస్తూ చెప్పారు.

"చూడండి, మిస్టర్ రాంబాబు, మీరేం చేస్తారో, మీ బాస్‌ని పిలుస్తారో నాకు అనవసరం. పంపు స్టార్టయితే తప్ప మీరు ఇంటికి వెళ్ళడానికి వీలులేదు"

రాంబాబు గుండెల్లో రాయి పడింది. టైం మూడు గంటలవుతోంది. మూడు గంటలకి ఫాక్టరీ నుంచి బయట పడితేకాని సాయంత్రం సమావేశానికి అవసరమైన పనులు పూర్తి చేయలేదు. ఎప్పటిలాగే మూడు గంటలకు ఫాక్టరీ నుంచి బయటకు రావచ్చనే అనుకున్నాడు రాంబాబు.

భారీ ఎత్తున ఏర్పాటు చేసారు సభ. హిమాలయం నుంచి వచ్చారు స్వామీజీ. మోక్షమార్గం గురించి అభిభాషణ చేస్తారు. పుర ప్రముఖులే కాదు, మంత్రిగారు కూడా విచ్చేస్తారు. కార్యక్రమ నిర్వహకుడైన తను వెళ్ళకపోతే...

"అది కాదు సార్..." – మెల్లగా గొణిగాడు రాంబాబు.

"ఏమిటి..." ఫైలు మీదే దృష్టి వుంచి జి.యం. గారు అడిగారు.

మళ్ళీ మెల్లగా ఏదో గొణిగాడు రాంబాబు. గట్టిగా మాట్లాడలేకపోయాడు. జి.యం. కళ్ళల్లో విరిసిన ఎర్రమందారాలని చూడలేక గోడవేపు దృష్టి మళ్ళించాడు.

గోడ నిండా కర్మాగారంలోని వివిధ విభాగాల ఫొటోలే! గోడని అలంకరించిన ఒకే ఒక కేలెండరు మీద బొమ్మ కూడా ఏదో యంత్రం మీద పనిచేసే కార్మికుడిదే! ఇంత క్రితం జి.యం. ఉండేటప్పుడు గోడ ఇలా ఉండేది కాదు. గోడ నిండా దేముడి బొమ్మలతో కూడిన కేలెండర్లు ఉండేవి. గది ఈశాన్య మూలలో దేముడి పటం. ఆ పటం వద్ద ఒక జీరో వాల్టు బల్బు ఉండేది. ఆ బల్బు సదా వెలుగుతూనే వుండేది.

"ఏమిటలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయారు?" – ఎఱ్ఱసిరాతో ఫైలులో ఏదో వ్రాస్తూ జి.యం. అన్నారు – "వెళ్ళి ఆ పంపు పని చూడండి"

"అది కాదు సార్... ఈ రోజు..."

"స్వామీజీ వారి అభిభాషణ ఉందంటారు. మూడు గంటలకే వెళ్ళాలంటారు, అంతేనా?" – బల్ల మీద వుండే పేపర్ వెయిట్ని గుండ్రంగా తిప్పుతూ అన్నారు జి.యం.

"సీ మిస్టర్ రాంబాబు, మీరు నగరంలో కార్యక్రమాల గురించి తరచూ మూడు గంటలకు వెళ్తున్నారని, దానివల్ల పని నిర్లక్ష్యం చేస్తున్నారని నాకు తెలుసు. కాని ఇక అలా కుదరదు. అంకితభావంతో పూర్తి టైం పనిచేయాలి. మీ వృత్తి పట్ల మీకో బాధ్యత వుందని గుర్తుంచుకోండి. మీ వృత్తి పట్లనే కాదు కుటుంబం పట్ల కూడా, ఒక బాధ్యత ఉంది. ఎంతో కొంత డబ్బు ప్రతీనెల ఇస్తే తీరేది కాదు ఆ బాధ్యత" – కుర్చీ నుంచి లేచారు జి.యం. రాంబాబుని సమీపించి మళ్ళీ అన్నారు – "వెళ్ళి పంపు పని పూర్తి చేయండి. ఆ తరువాతనే వెళ్లటం"

కేబిన్ తలుపు విసురుగా వేసి, బయటకు వచ్చాడు రాంబాబు. కోపంగా కర్మాగారం వైపు అడుగులు వేసాడు. మండిపడే సూర్యుని కోపానికి గురై తలవాల్చిన గులాబి మొక్కలు అతనికి స్వాగతం పలికాయి. రోడ్డు వారగా వుండి అదుపు తప్పి ఎదిగిన అశోక చెట్టు కొమ్మలని నరికే తోటమాలి రాంబాబుని పలకరించాడు. కాని రాంబాబు బదులు పలకలేదు.

పనిలో శ్రద్ధ పెట్టలేకపోయాడు రాంబాబు. ఫ్యాక్టరీలోనైనా, ఇంటిలోనైనా, జరగవలసిన ఆధ్యాత్మిక కార్యక్రమాల మీదే రాంబాబు శ్రద్ధ వుండేది. నిజమే! కాని ఇంటి విషయాలలో కూడా బాధ్యతారహితంగా ఉంటున్నాడనేది జి.యం.కి ఎలా తెలిసిందనేది అతని ఆలోచన.

ఇల్లు గుర్తుకురాగానే రాంబాబు మనస్సు కొంత వికలమైంది. అతని ఆశాకిరణమైన

సుపుత్రుడు మనస్సులో కదిలాడు.

డిగ్రీ చదువుతూనే వున్నాడు వాడు. చదువు కంటే వాడికి రాజకీయమంటేనే మక్కువ. తల్లి మాట కాని, రాంబాబు మాట కాని పట్టించుకోడు వాడు. కొడుకు అలా తయారు కావడానికి కారణం రాంబాబు ఇంటి వద్ద వుండకుండా తిరగటమేనని అతని భార్య రాంబాబుని వేధిస్తూ వుంటుంది. ఒకటి, రెండుసార్లు భార్య వేధింపు భరించలేక కొడుకుని పిలిచి మందలిస్తే, "నేను కూడా నీ దారిలోనే నడుస్తున్నాను డాడీ" అనే మాటలతో రాంబాబుని మాట్లాడకుండా చేసేసాడు వాడు.

"ఇదోసారి చూడండి సార్"

తన జూనియర్ మాటలకు ఉలిక్కి పడ్డాడు రాంబాబు. శ్రద్ధగా పనిచేసే అతని వద్దకు వెళ్ళాడు. వంగి పని చేసే ఆ నూనూగు మీసాల కుర్రవాడ్ని చూస్తూ వుంటే ముచ్చట వేసింది రాంబాబుకి. తన అబ్బాయి కంటే చిన్నవాడు, వాడు. ఐనా ఉద్యోగంలో సిద్ధపడిపోయాడు.

కాని తన కొడుకు... ఎక్కడ తిరుగుతున్నాడో... ఇల్లు చేరాడో లేడో...

కళ్ళు వొత్తుకున్నాడు రాంబాబు. గట్టిగా నిట్టూర్చాడు. పంపు పనిచేయకపోవటం వల్ల ఉత్పత్తి కోల్పోయిన కర్మాగారం విడిచిన నిట్టూర్పు ఆవిరిగా, అక్కడక్కడ బహిర్గతమవుతోంది.

ఆకాశాన జరిగే ప్రవచనానికి శ్రోతలైన తారకలు మెల్లమెల్లగా ప్రాంగణంలోకి చేరుకున్నాయి. కాషాయ మబ్బుల శాలువా ధరించిన చంద్రుడు వేదిక పైకి వచ్చాడు. మరో నాలుగు గంటలు గడిస్తే కాని పంపు పని పూర్తి కాలేదు. శారీరకంగానూ, మానసికం గానూ అలసిపోయిన రాంబాబు ఇంటి వద్ద వాలాడు.

ముభావంగానే తలుపు తీసింది రాంబాబు భార్య అలివేలు. మాటైనా పలకకుండా లోనికి వెళ్ళిపోయింది.

రాంబాబు పట్టించుకోలేదు. అది అతనికి మామూలే! ప్రవచనాలకని, ఆధ్యాత్మిక సభలకని ఎక్కడెక్కడో తిరిగి రాత్రి ఆలస్యంగా ఇంటికి రావటం, అలివేలు విసుగుగా తలుపు తీయటం గత పది సంవత్సరాలుగా జరుగుతూ వుంది. అతను సభలకు తిరగటం అలివేలుకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. కర్మాగారంలో పనివేళ తరువాత మిగిలిన సమయం ఇంటి గురించి వినియోగించాలనేది ఆమె కోరిక.

"మోక్షమట మోక్షం" – అలివేలు మొన్న కూడా విసుక్కుంది.

"పోయాక వచ్చే స్వర్గం గురించి జీవితాన్ని నరకం చేస్తున్నారండి మీరు" అలివేలు అంది– "బ్రతుకుని స్వర్గం చేసే మార్గం చూడండి"

అరుగు మీద కూర్చొని స్వామీజీ ప్రసంగం గురించి ఆనాటి పేపరులో వచ్చిన వార్త చూస్తున్న రాంబాబు ఆ మాటలు పట్టించుకోలేదు.

"మిమ్మల్నేనండి... నా మాట వినబడుతోందా?"

"ఏమిటి?" – చికాకుగా మోము తిప్పి అడిగాడు రాంబాబు.

"ఏమిటా... మీకు నా మాటలు ఎలా వినబడతాయిలెండి? నా ఖర్మండి, ఖర్మ ... మిమ్మలని..." – అలివేలు కళ్ళు నిండాయి.

ఆకాశంలో కరి మబ్బులు చేరాయి. వెలుగు తగ్గిపోయింది. వాన కురిస్తే జల్లుకు తడిసి పోతానని, రాంబాబు పేపరు పుచ్చుకొని లోనికి వెళ్ళాడు.

"ఎంత చెప్పినా మీకు అర్థం కాదు. చెప్తే వినరు కదా! పోనీ ఎదుటి వారిని చూసి నేర్చుకుంటారా అంటే అదీ లేదు" – అలివేలు మళ్ళీ అంది– పక్కింటాయనని చూడండి. మీకంటే తక్కువ జీతగాడని మీరే చెప్పారా! ఐనా, సమయం వృధా చేయకుండా ఓటీలు కీటీలు చేసి సంపాదిస్తున్నాడా! కొంప కట్టుకున్నాడా! పిల్లలని ఇంజినీర్లు చేసి అమెరికా పంపాడా! ఇప్పుడు చూడండి చీకు చింత లేకుండా ఉన్నాడు"

రాంబాబు ఆమెని కోపంగా చూసాడు. ఆమె పట్టించుకోలేదు.

"ఫ్యాక్టరి పని అవగానే ఇంటిలో వుంటాడు. నీటుగా తయారై మొగుడు పెళ్ళాలు కలిసి తిరిగి వస్తారు. స్వర్గం అంటే అదండీ, అది"

రాంబాబు ఏమీ అనలేదు. ఆధ్యాత్మిక చింతనతో కూడిన జీవితంలోని ఆనందం సినిమాల గురించి, షికారుల గురించి ఆలోచించే అలివేలు అలాంటి సగటు గృహిణికి ఏం తెలుస్తుందని సరిపెట్టుకున్నాడు. ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి!

***

"అన్నం వడ్డిస్తావా?" – చేతులు మోము కడుక్కొని వచ్చి అడిగాడు రాంబాబు.

"అన్నమా..." – అలివేలు మాటలలో వెటకారం ధ్వనించింది.

"ఈరోజు అక్కడ తిండి పెట్టలేదా? ఏమిటి?"

స్వామిజీ వారి ప్రవచనానంతరం ఫలహారాలు తీసుకొని ఇంటికి రావటం, రాంబాబుకి అలవాటు. మౌనంగా భోజనం బల్ల వద్దకు నడిచాడు రాంబాబు. అన్నం వడ్డిస్తుంటే గమనించాడు గిన్ని నిండా అన్నం ఉన్నట్టు.

"నువ్వు తినలేదా..." రాంబాబు అడిగాడు.

"నేను తింటేనేమిటి, తినకపోతేనేమిటి?" – అలివేలు గొంతు జీరపోయింది.

ఆమె కళ్ళ నుంచి కన్నీటి గోదారి కట్టలు తెంచుకొని ప్రవహించింది.

"నా బాగోగులు ఎవరికి కావాలి?"

రాంబాబు ఉలిక్కిపడ్డాడు. అతనికి కొంత బాధ కలిగింది.

ఒకవారం రోజుల నుంచి అలివేలు ఆయాసంతో బాధ పడుతోంది. ఊపిరి పీల్చలేక పోతోంది. డాక్టర్ వద్దకు తీసుకొని వెళ్ళమని అడిగింది కూడా. నాలుగు రోజులు తర్వాత స్వామీజీ వారి కార్యక్రమాలు అవగానే తీసుకొని వెళ్తానని చెప్పాడు రాంబాబు.

"ఆయాసం ఏమైనా ఎక్కువైందా?" రాంబాబు అడిగాడు.

"ఎక్కువైతేనే బాగుండేది. పోయేదాన్ని పీడ విరుగడైపోయేది. అప్పుడు ఇంటికి రావలసిన పని కూడా వుండదుగా. హాయిగా స్వామీజీల చుట్టూ తిరగవచ్చు"

ఒక నిమిషం అలా ఉండిపోయాడు, రాంబాబు. కలిపిన అన్నం ముద్ద చేతిలో అలా ఉండిపోయింది.

"ఎందుకు ఆగారు?" అలివేలు అంది – "తినండి బాగా తినండి. నేనూ నా కొడుకూ ఏమైతే మీకెందుకు?"

"ఏమైందో చెప్పు అలివేలు" – అనునయంగా అడిగాడు రాంబాబు.

"మనవాడ్ని... మనవాడ్ని... పోలీసులు అరెస్టు చేసారండి"

బల్ల మీద బాంబు పేలినట్టు తోచింది రాంబాబుకు.

"ఎందుకు..."

"ఏవో అల్లర్లు..." ఏవో అల్లర్లు చేయటం వాడికి అలవాటే. నిజానికి ఊరిలో ఒక చిన్న తరహా రౌడీ అనే పేరు కూడా వుంది వాడికి. కాని ఇప్పటి వరకు అరెస్టు కాలేదు.

"నీకు తెలియగానే ఫోను చేయలేకపోయావా?"

"నాకు తెలిసినప్పుడు నాలుగు గంటలైంది" అలివేలు అంది – "మూడు గంటల తరువాత మీరు ఫ్యాక్టరీలో వుండరు కదండి. మీకైతే సెల్ ఫోను కూడా లేదు"

"కేసు బుక్ చేసేసారో ఏమో?" కంగారుగా ఒకే ఒక ఉరుకులో ఇంటి బయటకు వచ్చి స్కూటరెక్కాడు రాంబాబు.

రోడ్డు చీకటిగా ఉంది. ముందడుగు వేయటానికి వెలుగు ఇవ్వవలసిన చంద్రుడు నల్ల మబ్బుల చీకటి గదిలో బందీగా పడి వున్నాడు. దారి చూపవలసిన వీధి దీపాలు వెలగడం లేదు.

పోలీసు స్టేషన్‌లో అలికిడి లేదు. కునుకు తీస్తూ స్టేషన్‌కు కాపలా కాసే జవానును తట్టి లేపాడు రాంబాబు.

"అయ్యగారు రౌండ్సుకు వెళ్ళారు" – నిద్రాభంగం కలిగించిన రాంబాబుని కోపంగా చూస్తూ అన్నాడు జవాన్.

"అదికాదు..." – రాంబాబు గొంతు తడబడింది. కడుపు నుంచి ఉప్పొంగిన దుఃఖం గొంతుని నొక్కేసింది.

"ఏదైనా ఇక రేపే..." – నిద్రలోకి జారాడు జవాన్.

ఏం చేయాలో తోచలేదు రాంబాబుకి. రేపటి వరకు వాడు సెల్‌లో వుంటే? పోలీసు రికార్డ్సుకు ఎక్కుతాడు. ఇక ఉద్యోగాలు...

తనకు తెలిసిన పెద్దవారెవరికైనా ఫోను చేసి ఇన్‌స్పెక్టర్‌తో సెల్లులో మాట్లాడిస్తే...

పోలీస్ స్టేషన్‌లోని గడియారం రెండుసార్లు మోగింది. ఏం చేయాలో తెలియక రాంబాబు పోలీసు స్టేషన్ నేల మీద చతికిల బడ్డాడు.

ప్రశాంతంగా, ఇంటిలో నిద్రపోవలసిన సమయంలో పోలీస్‌స్టేషన్‌లో కూర్చోవలసి వచ్చిన తన ఖర్మని తిట్టుకున్నాడు. హాయిగా ఇంటిలో నిద్రపోయే తన సహోద్యోగుల అదృష్టాన్ని మెచ్చుకున్నాడు. వాళ్ళు స్వర్గసుఖం అనుభవిస్తున్నట్టు తోచింది, అలసిపోయిన అతని కళ్ళు మూతలు పడ్డాయి.

రాంబాబు కళ్లు తెరిచినప్పుడు, ఎఱ్ఱ టోపీలు వేసుకున్న మబ్బుల జవానులు, ఆకాశంలో హుషారుగా పచార్లు చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ కుర్చీలో వున్నాడు.

లోనికి వెళ్ళాడు రాంబాబు.

"హలో రాంబాబుగారూ మీరా రండి" – ఆప్యాయంగా పలకరించాడు, ఇన్‌స్పెక్టర్.

"సార్, మా అబ్బాయి..."

"ఓ వాడా..." – ఇన్‌స్పెక్టర్ మోములో కొంత ఆశ్చర్యం, కొంత జుగుప్స తొంగి చూసాయి.

"వాడు, అదే ప్రొఫెసర్‌గారిని కొట్టిన వాడు... వాడు మీవాడా... అందరికీ నీతులు బోధించే మీకు ఇలాంటి కొడుకా ... ఛీ ఛీ..." – ఇన్‌స్పెక్టర్ లేచాడు.

నమిలే పొగాకు ఉమ్మేసి అన్నాడు – "ఐనా ఇలాగేనయ్యా పిల్లాడిని పెంచటం?"

రాంబాబు ఖంగు తిన్నాడు. తొలి పలకరింపులో ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన గౌరవం తన కొడుకు సంగతి యెత్తగానే నీరుకారి పోవటం రాంబాబు గమనించకపోలేదు.

"ఊరంతా తిరగటం కాదయ్యా. ఇంటిని, ఇంటిలో పిల్లలని కూడా పట్టించుకోవాలి" – ఇన్‌స్పెక్టర్ మళ్ళీ అన్నాడు.

"సార్ మా అబ్బాయి..." – మెల్లిగా గొణిగాడు రాంబాబు.

"వాడిక్కడ లేదు..."

"మరి..."

"నిన్ననే విడిచిపెట్టేశాం. నీ ముఖం చూసి కాదు. ఒక పెద్దాయన వచ్చి బతిమిలాడాడు. ఇక ఇలాంటి పోరంబోకు పనులు మీవాడు చేయడని మీవాడి తరఫున హామీ ఇచ్చారు. ప్రొఫెసరుగారు కూడా సానుభూతితో విడిచిపెట్టమని చెప్పారు." అందుకే..."

"ఎవరు, ఎవరు సార్ ఆ పెద్దాయన..." - రాంబాబు కంగారుగా అడిగాడు.

"అతనే - నువ్వు పనిచేసే ఫ్యాక్టరీ జి.యం."

***

స్కూటర్ ఎక్కాడు రాంబాబు. అతని బుర్రని ఆలోచనలు తొలిచివేశాయి. జి.యం. గారు తన అబ్బాయిని ఎందుకు విడిపించారు? అసలు జి.యం. గారికి ఈ విషయం ఎలా తెలిసింది? ఎప్పుడు తెలిసింది? తెలిసీ తనకెందుకు చెప్పలేదు?

నవ్వుతూ పలకరించాడు జి.యం. ఇంటిలోనికి ఆహ్వానించారు. కూర్చోమన్నారు. నౌకర్ని పిలిచి కాఫీ తెమ్మన్నారు.

రాంబాబుకు ఆశ్చర్యం కలిగింది. ఉద్యోగులని ఇంటికి రానివ్వని జి.యం. తనని ఇలా పలకరించడమేమిటి?

"చూడండి, రాంబాబుగారు" - జి.యం. అన్నారు -

"మీ అబ్బాయి మా ఇంట్లోనే వున్నాడు. నిద్ర పోతున్నాడు"

"సార్..." - రాంబాబు రెండు చేతులు జోడిస్తూ అన్నాడు- "మీరు చేసిన ఈ సహాయం..."

జి.యం. ఆ మాటలు పట్టించుకోలేదు.

"సీ మిస్టర్ రాంబాబు" - అతను మళ్ళీ అన్నారు.

"ఒక తండ్రిగా మీ బాధ్యత మీరు నిర్వర్తించలేదు. పిల్లవాడ్ని సరైన మార్గంలో పెట్టలేదు"

తల దించుకున్నాడు రాంబాబు.

కాఫీ వచ్చింది.

"నేను ఒకటి చెప్పాలని అనుకుంటున్నాను" - కాఫీ చప్పరిస్తూ అన్నారు జి.యం.

"మోక్షం పొందాలని, స్వర్గం చేరుకోవాలని అందరూ కోరుకుంటారు. స్వామీజీల ప్రసంగాలలోని సారాంశం మీరు గ్రహించినట్టు లేరు"

ప్రశ్నార్థకంగా చూసాడు రాంబాబు.

"మిమ్మల్ని ఫ్యాక్టరీలో పనివేళలు ఎగ్గొట్టి, బాధ్యతలు మర్చిపోయి మోక్ష సాధన

చెయ్యమని ఎవరూ ఉపదేశించారు... మన ధార్మిక చింతన యొక్క సారాంశమే స్వధర్మం పాటించమని. అంటే... ఉద్యోగిగా, భర్తగా, తండ్రిగా, ఒక పౌరుడిగా చేయవలసినవి సక్రమంగా చేయటం నీ విధి. నీ విధి నువ్వు నిర్వర్తిస్తే స్వర్గం చేరుకుంటావని – దానివల్లే – నీ జీవితమే స్వర్గమౌతుందని..."

రాంబాబు లేచాడు. జి.యం. గారికి రెండు చేతులు ఎత్తి మొక్కాడు. ఏ గురువు ఇవ్వని ఉపదేశం జి.యం. ఇచ్చినట్లు తోచింది అతనికి.

రెండడుగులు ముందుకు వేసాడు. ఆ తర్వాత వెనక్కు తిరిగి అడిగాడు. – "సార్ మా అబ్బాయిని పోలీసులు ఆరెస్టు చేసారని..."

"నాకెలా తెలిసిందనా..." – జి.యం. గట్టిగా నవ్వాడు.

"మీ ఆవిడే చెప్పిందయ్యా..."

"మా... ఆవిడా...!"

"మీ ఆవిడే ఫోన్ చేసింది. ఆవిడే నాకు మీ గురించిన విషయాలన్నీ చెప్పింది. నేనూ, మా ఆవిడ రెండు మూడుసార్లు మీ ఇంటికి కూడా వచ్చామయ్యా!"

"అలాగా మీరు వచ్చినట్టు..."

"మీ ఆవిడ చెప్పలేదనా... ఓ... ఆవిడ మాటలు వినటానికి మీకు తీరికెక్కడిది? కంగారు పడక. మీ ఆవిడ మా మాష్టారుగారి అమ్మాయి. ఊరిలో మా పక్కిల్లే..."

ఆ మాటలకు రాంబాబు స్పందించక ముందే గడియారం ఎనిమిది సార్లు మోగింది. ఫ్యాక్టరీ పనివేళ గుర్తుకు వచ్చిన రాంబాబు స్కూటర్ ఎక్కాడు.

మంచుపొరలని తొలిచి బయటకు వచ్చిన సూర్యకిరణాలు పలకరిస్తున్న దారిలో స్కూటర్ నడపటం చాలా హాయిగానూ, సులువుగానూ తోచింది రాంబాబుకి.

***